సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 65 ఫిర్యాదులు నమోదయ్యాయి. అదనపు కలెక్టర్ వినతులు స్వీకరించారు.

- 8లో ▸



ఎండుతున్న మొక్కలు

అటవీ ప్రాంతంలో నాటిన మొక్కల సంరక్షణను అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మొక్కలు ఎండిపోతున్నాయి.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /10.1

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణంలో శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధి నీలం నర్సింలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 25 ఏళ్లలోపు మహిళలకు ఉచితంగా టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులలో 45 రోజుల శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 99630 07364 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సాంకేతిక సమస్యను పరిష్కరించండి



కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలను తొలగించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ప్రతినిధులు సోమవారం డీఈవో రాజుకు వినతి పత్రం అందజేశారు. 317 జీవో ప్రకారం ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల సర్వీసును నమోదు చేయడానికి నెలలు మాత్రమే వస్తుందని, సంవత్సరాలు నమోదు కావడం లేదని వారు డీఈవోకు విన్నవించారు. సాఫ్ట్‌వేర్ సమస్యను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సరిదిద్దాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ఓపెన్ రెజ్లింగ్‌లో విద్యార్థి ప్రతిభ

నస్రుల్లాబాద్(బీర్కూర్): రాష్ట్ర స్థాయి ఓపెన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో బీర్కూర్ మండలం దామరంచ జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న శివానంద్ ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. శివానంద్ 53 కేజీల విభాగంలో రన్నర్‌గా నిలిచాడని పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు.

డుమ్మా టీచర్లకు షోకాజ్‌లు

కామారెడ్డి టౌన్: విధులకు హాజరుకాకున్నా సంతకాలు చేసిన ఇద్దరు ఉపాధ్యాయులకు డీఈవో ఎస్.రాజు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సదాశివనగర్ మండలం తిమ్మోజీవాడి యూపీఎస్ స్కూల్ టీచర్ డి.పాండురంగం గతేడాది జూన్ 13న, బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేసే టీచర్ జే.స్వామి 2015 సెప్టెంబర్ 3వ తేదీన సెలవు మంజూరు కాకున్నా అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారు. వీరు పాఠశాలకు వెళ్లకున్నా రిజిస్టర్‌లో సంతకాలు చేశారన్నారు. విచారణ అనంతరం వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అంబులెన్స్‌లో వచ్చి.. సమస్యను విన్నవించి..



విధి ఆడిన ఆటలో ఓ కుటుంబం రోడ్డున పడింది. ఆపన్న హస్తం అందించాలంటూ బాధిత కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో సోమవారం కలెక్టర్ కార్యాలయానికి తరలి వచ్చారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో తమ గోడును వెళ్లబోసుకున్నారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన అల్వాల పవన్ పేయింటింగ్ పనిచేస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏడు నెలల క్రితం ఆనంద్‌నగర్‌లో ఓ రెండంతస్తుల భవనానికి పేయింటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో పవన్ నడుముకు దెబ్బ తగలడంతో మంచానికే పరిమితమయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స కోసం రూ. 5లక్షల వరకు ఖర్చు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిజియోథెరపి కోసమే నెలకు రూ. 15 వేలు ఖర్చవుతోందని బాధితుడు పేర్కొన్నాడు. కుటుంబ పోషణ భారమై.. ఇంటి అద్దె చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారని ప్రభుత్వం దయతలచి తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకున్నాడు. పని చేయలేక, భార్య పిల్లల ఆకలి తీర్చలేక దీనస్థితిలో ఉన్నానని కన్నీటి పర్యంతమయ్యాడు. దాతలు సైతం ముందుకు వచ్చి తమకు తోచిన సహాయం చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మనసున మనసై..

Valentine's Day



ప్రేమ ఒక మధురమైన అనుభూతి.. దానికి కుల మతాల పట్టింపులు లేవు.. భాషాభేదాలూ తెలియవు.. మనసు పలికే మౌనభాష అది. రెండు హృదయాలను ఏకం చేసే భావనే ప్రేమ.. దానిని పెళ్లి వరకు తీసుకువెళ్లి జీవితాంతం కష్టసుఖాలను పంచుకుంటూ తోడునీడగా జీవించగలిగితేనే సార్థకత.. కులాలు వేరైనా వైవాహిక బంధంతో ఒక్కటై జీవన నావను సాఫీగా సాగిస్తున్న వారెందరో ఉన్నారు. మంగళవారం వాలంటైన్స్ డే నేపథ్యంలో ప్రేమ వివాహం చేసుకుని ఆనందమయ జీవితాన్ని గడుపుతున్న పలువురు ప్రముఖుల గురించి కథనం..

– సాక్షి, కామారెడ్డి

డాక్టర్ కపుల్స్..



రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, కామారెడ్డి డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మిలది ప్రేమ వివాహం. మెడిసిన్ చదువుతున్నపుడు వారి మనసులు కలిశాయి. ఒకరినొకరు అర్థం చేసుకున్న విజయలక్ష్మి, అజయ్‌కుమార్.. వివాహ బంధంతో ఒక్కటయ్యారు. పెళ్లి చేసుకున్న తర్వాత ఉన్నత చదువులు పూర్తి చేశారు. వైద్య రంగంలో రాణించి ఉన్నత స్థాయికి ఎదిగారు. వారి కుమారులనూ ప్రయోజకులను చేశారు. ఒకరినొకరు అర్థం చేసుకుని ముందుకు నడిస్తే ఏ సమస్య ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనవచ్చని డాక్టర్ అజయ్‌కుమార్, డాక్టర్ విజయలక్ష్మి పేర్కొంటున్నారు.

వెన్నుదన్నుగా..



కామారెడ్డికి చెందిన సీనియర్ న్యాయవాది జి.జగన్నాథం 1981 లో పట్టణానికి చెందిన రాజ్యలక్ష్మిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ముగ్గురు కుతుళ్లు. అందరినీ ఉన్నత చదువులు చదివించారు. జగన్నాథం విద్యార్థి దశ నుంచే సామాజిక సమస్యలపై ఉద్యమాలు చేశారు. జిల్లా కేంద్రంలో సిటిజన్స్ ఫోరం, జేఏసీలకు నాయకత్వం వహించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. కష్టసుఖాల్లో ఒకటిగా సాగితే కుటుంబ జీవితం సక్సెస్ అవుతుందని రాజ్యలక్ష్మి, జగన్నాథం దంపతులు పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయ దంపతులు..



కామారెడ్డి పట్టణానికి చెందిన నిట్టు విఠల్‌రావ్ 1965 లో టీచర్‌గా ఉద్యోగంలో చేరారు. ఏపీలోని రేపల్లె ప్రాంతానికి చెందిన హైమావతి 1966లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారు. వీరిద్దరు ఎల్లారెడ్డి పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పనిచేసే సమయంలో ఒకరినొకరు ఇష్టపడ్డారు. కులాలు వేరు కావడంతో వీరి ప్రేమను ఇరు కుటుంబాలు అంగీకరించలేదు. దీంతో 1967 మే 17న తిరుపతికి వెళ్లి వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. ముగ్గురినీ ఉన్నత చదువులు చదివించించారు. విఠల్‌రావ్ ఎనిమిది పదుల వయసులోనూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఇప్పటికీ పనిచేస్తున్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘంలో జిల్లా బాధ్యుడిగా సేవలందిస్తున్నారు. భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో పోలీసులను ఆశ్రయించిన ఎన్నో జంటలకు విఠల్‌రావ్ కౌన్సిలింగ్ ఇచ్చి కలిసిమెలిసి ఉండేలా ఒప్పించారు. కామారెడ్డి ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి వీరి మనవరాలే..

తోడూనీడగా...



తాను చదువుకున్న బడిని రూ. 6.50 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిన బీబీపేట మండలంలోని జనగామ గ్రామానికి చెందిన తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డిది కూడా ప్రేమ వివాహమే.. ఆయన 1977లో రైలులో వెళ్తుండగా.. కడప జిల్లాకు చెందిన రజని పరిచయమయ్యింది. ఆ పరిచయం కాగా ప్రేమగా మారింది. అనంతరం పెద్దల అంగీకారంతో వారు వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. సుభాష్‌రెడ్డి నిర్మాణ రంగంలో రాణించి ఉన్నత స్థానానికి చేరారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారు. ఆయనకు రజని వెన్నుదన్నులా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే జీవితం సంతోషంగా ఉంటుందని రజని, సుభాష్‌రెడ్డి దంపతులు పేర్కొంటున్నారు.

ప్రేమిస్తే ఒప్పించాలి

- తొందరపాటు వద్దు.. కెరీర్ ముఖ్యం
- జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి
- తల్లిదండ్రుల ఆశీస్సులు ముఖ్యం
- 'సాక్షి' టాక్‌షోలో ఛాత్రోపాధ్యాయులు

కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్: 'ప్రేమ వల్లే జీవిత ప్రయాణం సాఫీగా సాగుతుంది. ప్రేమలు లేకుంటే బంధాలు ఎక్కువ కాలం నిలవవు' అని వక్తలు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో 'సాక్షి' 'పెళ్లికి ముందు ప్రేమ.. పెళ్లి తర్వాత ప్రేమ' అనే అంశంపై టాక్ షో నిర్వహించింది. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొని ప్రేమ, పెళ్లిళ్లు, బంధాలపై మాట్లాడారు. 'ప్రేమైనా, పెళ్లైనా జీవితంలో స్థిరపడ్డాకే చేసుకోవాలి. ఆకర్షణకు లోనుకావొద్దు. ప్రేమిస్తే పెద్దలను ఒప్పించాలి. తల్లిదండ్రుల అంగీకారంతో పెళ్లి చేసుకుంటేనే బాగుంటుంది'' అన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

సాక్షి టాక్ షో



టాక్‌షోలో పాల్గొన్న బీఈడీ విద్యార్థులు

జీవితాంతం కొనసాగాలి



ప్రేమ ఉంటే జీవిత ప్రయాణం సాఫీగా సాగుతుంది. పెళ్లికి ముందైనా తర్వాతైనా ప్రేమ ఉండాలి. అది లేకపోవడంతోనే బంధాలు, కుటుంబాలు చెదిరిపోతున్నాయి. కేవలం అట్రాక్షన్ ఎంతోకాలం నిలవదు. చదువు కాగానే పెళ్లిళ్లు వద్దు. భవిష్యత్తు ఏర్పరచుకున్నాకే ప్రేమించి అయినా, పెద్దలు కుదిర్చిన వివాహమైనా చేసుకుంటే బాగుంటుంది.

– డాక్టర్ రషీద్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్

ప్రేమ విలువ కొందరికే తెలుసు..



చాలామంది ఆకర్షణనే ప్రేమగా భావిస్తున్నారు. ప్రేమ అంటే అనుభవం, ఆలోచన, నమ్మకం. దాని విలువ కొందరికే తెలుస్తుంది. తల్లిదండ్రులు అన్నీ ఆలోచించే వివాహం జరిపిస్తారు. యువత ఆకర్షిత ప్రేమకు బలికావొద్దు.

– నౌషీన్, లెక్చరర్

తల్లిదండ్రులను ఒప్పించాలి..



ప్రేమ ఒక ఎంజాయ్‌మెంట్ వస్తువు కాదు. అరెంజ్ మ్యారేజ్‌లే చాలా గొప్పవని నా అభిప్రాయం. తల్లిదండ్రులు తమ అనుభవాలతో అన్నీ ఆలోచించి పెళ్లిళ్లు జరిపిస్తారు. అయితే ప్రేమించుకున్నా తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుంటేనే బాగుంటుంది.

– రాజు, బీఈడీ విద్యార్థి

స్థిరపడ్డాకే..



సెల్‌ఫోన్‌ల వల్ల ఆకర్షిత ప్రేమలు ఎక్కువయ్యాయి. పరిచయం లేని వారిని, వారి కుటుంబ నేపథ్యం తెలుసుకోకుండా పెళ్లి చేసుకోవడం సరికాదు. జీవితంలో స్థిరపడ్డాకే ప్రేమించైనా.. పెద్దలు చూసిన సంబంధమైనా చేసుకోవాలి. ప్రేమ, పెళ్లి విషయాల్లో తొందరపాటు వద్దు.

– భవ్యశ్రీ, బీఈడీ విద్యార్థి

మాస్టర్ ప్లాన్‌పై హైకోర్టులో వాదనలు

- ఏప్రిల్ 17కు వాయిదా..
- కోర్టుకు తెలపకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ప్రభుత్వానికి ఆదేశం



రైతులతో మాట్లాడుతున్న కేఏ పాల్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో వేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. కామారెడ్డి నుంచి రైతులు తరలివెళ్లి కోర్టులో తమ గోడును వెళ్లబోసుకున్నారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ మాస్టర్‌ప్లాన్ రద్దు చేస్తూ తీర్మానం చేయడంపై ప్రభుత్వ నిర్ణయాన్ని తెలపాల్సిందిగా గత విచారణ సమయంలో కోర్టు కోరింది. మాస్టర్‌ప్లాన్‌ను హోల్డ్‌లో ఉంచామని ప్రభుత్వం తరుపున న్యాయవాది ధర్మాసనానికి సమాధానం ఇచ్చారు. కోర్టుకు తెలపకుండా మాస్టర్‌ప్లాన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మాస్టర్ ప్లాన్‌పై సింగిల్ బెంచ్‌లో ఉన్న మరో పిటిషన్‌ను డివిజన్ బెంచ్‌లో ఇంప్లీడ్ చేసింది. డివిజన్ బెంచ్‌లో పార్టీ ఇన్‌పర్సన్‌గా కేఏ పాల్ తన వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న ధర్మాసనం విచారణను ఏప్రిల్ 17కు వాయిదా వేసింది.

'రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తాం'



కంచర్ల గ్రామస్తులతో మాజీ మంత్రి షబ్బీర్ అలీ

భిక్కనూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలండర్‌ను రూ. 500 లకే ఇస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోమవారం షబ్బీర్ అలీ సమక్షంలో కంచర్ల గ్రామస్తులు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. తిప్పాపూర్ కాంగ్రెస్ నూతన కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజస్థాన్‌లో రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. వరి క్వింటాలుకు రూ. 2,500 మద్దతు ధర అందిస్తామన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, నేతలు సుధాకర్‌రెడ్డి, ధర్మయ్య, దుర్గయ్య, సిద్దాగౌడ్, సాజీద్, నర్సింలు, మహేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్: జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో ఈ నెల 13 నుంచి 17 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వాల్ పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బ్యాంకు సేవలను సరైన రీతిలో నిర్వహించడానికి ఈ వారోత్సవాలు దోహదపడతాయని చెప్పారు. జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎల్డీఎం చిందం రమేష్, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

5,871 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 5,871 మందికి కంటి పరీక్షలు చేశారు. 940 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 88,027 మందికి కంటి పరీక్షలు చేసి 15,581 మందికి రీడింగ్ కంటి అద్దాలను అందించామని వైద్యాధికారులు తెలిపారు. మరో 14,395 మందికి అద్దాలు అవసరమని గుర్తించి, ఆర్డర్ పెట్టామని వివరించారు.ద

'విద్య, వైద్యం ఉచితంగా అందిస్తాం'



సోమారంపేటలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎల్లంపేట, మర్రి తండా, బంజెపల్లి, నెమిలిగుట్టతండా, సర్దా పూర్ తండా, సోమారంపేట, రత్నగిరిపల్లి గ్రామా ల్లో 'పల్లె గోస.. బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పేదలు డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల గోడును పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు చారి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట బాలరాజు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌నాయక్, సురేశ్, స్వామి, వసంత్‌నాయక్, పరశురాం, ఓదెలు, శ్రీను, నర్సింలు, ప్రభాకర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ సజావుగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15 నుంచి మార్చి 2 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, జిల్లా పరీక్షల నియంత్రణ కమిటీ ప్రతినిధులు అజ్మల్ ఖాన్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. నిజామాబాద్‌లోని సీఎస్ఐ డిగ్రీ కాలేజీ కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు, శ్రీవిశ్వ శాంతి డిగ్రీ కాలేజీ పరీక్షా కేంద్రంలో మరొక విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు కంట్రోలర్ తెలిపారు.

24 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ, ఎంబీఏ మొదటి, మూడో సెమిస్టర్, ఎల్ఎల్ ఎం మూడో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ మూడో, ఐదో సెమిస్టర్, ఐఎంబీఏ ఏడో, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు జరుగుతాయన్నారు.

16 నుంచి బీఈడీ ప్రాక్టికల్ పరీక్షలు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మూడో సెమిస్టర్ (ఈపీసీ-3, ఈపీసీ-4) ఫేజ్-1 ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 16, 17వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు. అలాగే ఈ నెల 20, 21వ తేదీల్లో ఫేజ్ -2 ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు.

తెయూ ఇంటర్ కాలేజీ క్రికెట్ టోర్నీ ప్రారంభం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ క్రికెట్ (మెన్) టోర్నమెంట్ సోమవారం క్యాంపస్ క్రీడా మైదానంలో ప్రారంభమైంది. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ సంపత్‌కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీ క్రికెట్ టోర్నీ నిర్వహించడం ఇదే మొదటిసారి అన్నారు. సోమవారం తొలి రోజు వివిధ కళాశాలల నుంచి వచ్చిన 8 జట్లు పోటీ పడ్డాయి.

మొదటి రోజు విజేతలు

మొదటి మ్యాచ్ కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ కళాశాల (సౌత్‌క్యాంపస్) జట్ల మధ్య జరిగింది. ఇందులో యూనివర్సిటీ కళాశాల గెలుపొందింది. కామారెడ్డి ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కళాశాల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో ట్రైబల్ వెల్ఫేర్ జట్టు విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్‌లో నిజామాబాద్ గిరిరాజ్ కళాశాల, యూనివర్సిటీ డిగ్రీ జట్లు తలపడగా గిరిరాజ్ కాలేజీ గెలిచింది. పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ, పీజీ కళాశాల, యూనివర్సిటీ కళాశాల (సౌత్‌క్యాంపస్) మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో యూనివర్సిటీ కళాశాల జట్టు విజయం సాధించింది.

ప్రేమిస్తే ఒప్పించాలి



సాక్షి టాక్‌షోలో మాట్లాడుతున్న డాక్టర్ రషీద్

సాక్షి టాక్ షో Valentine's Day

కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్: ప్రేమ ఎంతో మధురమైంది.. ప్రేమతోనే జీవిత ప్రయాణం సాఫీగా సాగుతుంది.. ప్రేమ లేకుంటే బంధాలు ఎక్కువ కాలం నిలవవని బీఈడీ కాలేజీ విద్యార్థులు అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో 'పెళ్లికి ముందు ప్రేమ.. పెళ్లి తర్వాత ప్రేమ' అనే అంశంపై నిర్వహించిన టాక్ షోలో అధ్యాపకులు, విద్యార్థులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రషీద్ హాజరయ్యారు. సాక్షి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సేపూరి వేణుగోపాలచారి, ఆర్సీ ఇన్‌చార్జి చౌబిన్ సురేష్, తోట రాజేష్ పాల్గొన్నారు.

అర్థం చేసుకుంటే..



ముఖ్యంగా పాశ్చాత్య సంస్కృతిని విడనాడాలి. ప్రేమ వివాహమైనా, అరెంజ్ మ్యారేజ్ అయినా ప్రేమ లేకపోతే కలిసి ఉండలేరు. పెళ్లికి ముందు, తర్వాత ప్రేమ అవసరం. ఒకరినొకరు అర్థం చేసుకుని జీవితాన్ని సాగించాలి. – రాజశేఖర్, బీఈడీ విద్యార్థి

నమ్మకం ముఖ్యం



పెళ్లికి ముందు ప్రేమే ముఖ్యం. ప్రేమించుకోవడం వల్ల ఒకరినొకరు అర్థం చేసుకుంటారు. అదే ప్రేమ జీవిత కాలం కొనసాగించగలగాలి. ఆకర్షిత ప్రేమ, నమ్మకం లేని బంధం ఎక్కువకాలం నిలువవు.

– భవాని, బీఈడీ విద్యార్థి

డామినేట్ చేయొద్దు



ప్రేమ వివాహమైనా, పెద్దలు కుదిర్చిన వివాహమైనా.. మనం ప్రేమ చూపే విధానాన్ని బట్టి బంధాలు నిలుస్తాయి. ఒకరిపై మరొకరు డామినేషన్ చేయాలని చూస్తే ఆ బంధం నిలువదు. రెండు రకాల పెళ్లిళ్లలో పలు తప్పిదాలు ఉన్నాయి. వాటిని సరిదిద్దుకోవాలి.

– స్రవంతి, బీఈడీ విద్యార్థి

రెండూ సమానమే..



ప్రేమ పెళ్లి.. పెద్దలు కుదిర్చిన వివాహం.. నా దృష్టిలో రెండూ సమానమే. ఏ విధానంలో పెళ్లి చేసుకున్నా ఇద్దరూ ఒకరిని ఒకరు అర్థం చేసుకోవాలి. వైవాహిక బంధంలో అపార్థాలకు తావివ్వొద్దు. తల్లిదండ్రులు, సోదరి సోదరులు, భార్యాభర్తలు.. ఇలా అందరి మధ్య ప్రేమ ఉంటే బంధాలు బలంగా నిలబడతాయి.

– లావణ్య, బీఈడీ విద్యార్థి

నవ్వులపాలు కావొద్దు



యువత కొంతమంది తొందరపడి ప్రేమించి పెళ్లి చేసుకుని తల్లిదండ్రులకు దూరమవుతున్నారు. ప్రేమిస్తే పెద్దలను ఒప్పించాలి. వారు ఒప్పుకోవడం లేదంటే.. తమ ప్రేమలో లోపం ఉందేమో ఆలోచించాలి. ప్రేమించి పెళ్లి చేసుకున్నా.. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలి. సమాజం నవ్వుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు. – అఫియా ఫాతిమా, బీఈడీ విద్యార్థి

ఆకర్షణకు లోను కావొద్దు



పెళ్లికి ముందు ప్రేమ, పెళ్లి తర్వాత ప్రేమ రెండూ ప్రధానమే. ఎక్కడ ప్రేమ లేకున్నా బంధాలు నిలవవు. ఇప్పుడు పదో తరగతి కాకుండానే ప్రేమలో పడుతున్న వారిని చూస్తున్నాం. అది ఆకర్షణే.. జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుంటే బాగుంటుంది. అది ప్రేమ వివాహమైనా, పెద్దలు కుదిర్చిన వివాహమైనా..

– కీర్తన, బీఈడీ విద్యార్థి

మనసులు కలిసి..



బోధన్: ప్రేమించి పెళ్లి చేసుకుని అన్యోన్యంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ యువ దంపతులు. కుల అంతరాలు, కుటుంబ సభ్యుల అభ్యంతరాలను ఎదుర్కొని పెళ్లి చేసుకున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్లా గ్రామానికి చెందిన సంపత్ (23), నవ్య (22) వేర్వేరు కులాలకు చెందిన వారు. సొంత ఊరులో చిన్న వయస్సు నుంచే ఇరువురికి పరిచయం ఉంది. ఈ క్రమంలో మనసులు కలిసి ప్రేమలో పడి పెళ్లి చేసుకుందామని నిర్ణయానికొచ్చారు. ఇరువురు వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. నవ్య తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. దీంతో 2021లో సొంత ఊరు నుంచి బోధన్ ప్రాంతానికి వచ్చి ఓ ఆలయంలో పెళ్లి చేసుకుని ఇక్కడే స్థిరపడ్డారు. యువ దంపతులకు మూడు నెలల బాబు ఉన్నాడు. సంపత్ వృత్తి రీత్యా మోటార్ బైక్ మెకానిక్. బోధన్‌లో బైక్ మెకానిక్ దుకాణం ఏర్పాటు చేసు కుని స్వయం ఉపాధి పొందుతున్నాడు. భార్యను ప్రేమగా చూసుకుంటున్నాడు.

ఫిర్యాదులను పరిష్కరించాలి



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తదితరులు

కామారెడ్డిక్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 65 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. డీఆర్‌డీఓ సాయన్న, ఏవో రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు అన్యాయం

రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు రెండు శాతం నిధులు కేటాయించడం అన్యాయం అని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా శాఖ పేర్కొంది. సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు తరలివచ్చి ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. నీల నాగరాజు, సాప శివరాములు, ఐరేని సందీప్, మేదరి లక్ష్మీ, సుమ ప్రియ, చాకలి రాజయ్య, మోహనాచారి ఉన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

మీ సేవ కేంద్రంపై ఫిర్యాదు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం నిజాంసాగర్ చౌరస్తాలోని మీ సేవ సెంటర్‌లో ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అధికంగా రుసుం వసూలు చేస్తున్నారని ఇల్చిపూర్‌కు చెందిన పి రమేష్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎఫ్‌పీవోలకు సంపూర్ణ సహకారం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్

డిచ్‌పల్లి: రైతుల సర్వతోముఖాభివృద్ధికి రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీవో) కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. డిచ్‌పల్లిలోని కేఎస్ఆర్ గార్డెన్స్‌లో ఇందూరు డిచ్‌పల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘం కంపెనీ లిమిటెడ్ చైర్మన్ మచ్చర్ల నాగయ్య అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్‌పీవోలకు వ్యవసాయ శాఖ తరఫున సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేసుకుని అందులో సభ్యులుగా చేరడంతో వ్యవసాయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు అధిగమించి, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు, కోల్డ్ స్టోరేజీలు, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో పాటు ఎఫ్‌పీవోలు మరింత కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. అలాగే ఎరువులు, విత్తనాల అమ్మకాల కోసం అవసరమైన లైసెన్స్‌ల జారీ అంశంలో జిల్లా వ్యవసాయ శాఖ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మంచి కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుని లాభాలు సాధించాలన్నారు. రైతులు ఒకే పంటను సాగు చేయకుండా పంటమార్పిడి విధానం అలవాటు చేసుకోవాలన్నారు. అవసరమైన మేరకే యూరియా వాడాలన్నారు. ఈ సమావేశంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కొండెల సాయరెడ్డి, డైరెక్టర్లు వేల్పూర్ భూమయ్య, ఆకుల పాపయ్య, జంగం భూమయ్య, కూచన్‌పల్లి స్రవంతి, కూచనకోట అఖిల, కదం పెంటయ్య, టీఎన్‌రెడ్డి, శ్రీకాంత్, నాప్కాస్ జిల్లా అధికారి థామస్ మోడీ, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు

కొడుకు, మనవడు కొడుతున్నారు..

- సీపీకి ఫిర్యాదు చేసిన వృద్ధురాలు

నిజామాబాద్‌నాగారం: తన కొడుకు, మనవడు మానసికంగా ఇబ్బందులు పెట్టుతూ, కొడుతున్నారని నగరంలోని శివాజీనగర్ కాలనీ చెందిన సిర్ప గంగమణి సోమవారం సీపీ నాగరాజుకు ఫిర్యాదు చేసింది. ఇంట్లో ఉండనివ్వడం లేదని, పెన్షన్ డబ్బులు తీసుకుంటున్నారని వాపోయింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. స్పందించిన సీపీ చర్యలు తీసుకోవాలని ఏసీపీని ఆదేశించారు.



రోదిస్తున్న గంగమణి

సీఎస్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని జిల్లా పరిషత్ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు సోమవారం హైద్రాబాద్‌లోని మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ



మాట్లాడుతున్న జాగృతి జిల్లా కన్వీనర్ అవంతి

నిజామాబాద్‌నాగారం: ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకొని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ అవంతి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జాగృతి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో మహిళలకు, పురుషులకు టోర్నీ ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.25వేలు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న జిల్లా క్రీడాకారులు హైదరాబాద్‌కు వెళ్లాలన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, లక్ష్మీనారాయణ భరద్వాజ్, నరాల సుధాకర్, సాయికృష్ణ, అనిల్, రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీసీసీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ నగరంలో టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 246 మంది పరీక్షకు హాజరయ్యారు. మానిక్‌భవన్, కోటగల్లీ, శంకర్‌భవన్ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయి. మంగళవారంతో పరీక్షలు ముగియనున్నాయి.

క్రైం కార్నర్

మహిళ బ్యాగులోంచి బంగారం చోరీ

- కామారెడ్డి బస్టాండ్‌లో ఘటన



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

కామారెడ్డి క్రైం: మహిళ బ్యాగులోంచి రెండు తులాల బంగారు ఆభరణాలను చోరీకి గురైన ఘటన కామారెడ్డి కొత్త బస్టాండ్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన మధువాణి గతంలో జిల్లా కేంద్రంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి డబ్బు తీసుకున్నారు. సోమవారం ఫైనాన్స్‌కు వెళ్లి బంగారు ఆభరణాలు విడిపించుకుని స్వగ్రామానికి వెళ్లడానికి కొత్త బస్టాండ్‌కు వచ్చింది. బస్సు కోసం వేచి ఉండగా దొంగలు బంగారు ఆభరణాలను కాజేశారు. కొద్ది సేపటికి హ్యాండ్ బ్యాగ్ తెరిచి చూసేసరికి బ్యాగులో ఉంచిన రెండు తులాల బంగారం కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో వృద్ధుడు అదృశ్యం



విద్యాసాగర్

ఖలీల్‌వాడి: నగరంలోని సూర్యనగర్‌లో నివాసం ఉండే వసంత విద్యాసాగర్(67) కనబడటం లేదని ఆయన కుమారుడు సురేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిన విద్యాసాగర్ తిరిగి ఇంటికి రాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో టౌన్ ఎస్సై సందీప్ తెలిపారు.

లింగంపేటకు చెందిన మహిళ..

లింగంపేట: లింగంపేటకు చెందిన ధారావత్ సునీత అదృశ్యమైనట్లు ఎస్సై శంకర్ తెలిపారు. సునీత లింగంపేట నుంచి ప్రతీ రోజు కూలీ పని కోసం కామారెడ్డి వెళ్లి వస్తుండేది. డిసెంబర్ 28న కూలీ పనుల కోసం కామారెడ్డికి వెళ్లింది. ఆ రోజు రాత్రి అయినా ఇంటికి రాలేదు. తండ్రి రాములు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

జక్రాన్‌పల్లి: జల్సాలకు అలావాటు పడి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలోని గాంధీనగర్‌లో ఈ నెల 6న మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసు అపహరించిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మోహన్, జక్రాన్‌పల్లి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సోమవారం జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. వేల్పూర్‌కు చెందిన షేక్ సమీర్, మహమ్మద్ ముజామిల్ జల్సాలకు అలవాటు పడ్డారు. తొందరగా డబ్బులు సంపాదించాలని ఈ నెల 6న గాంధీనగర్‌లో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ పక్కన నేరేడు పళ్లను అమ్ముతున్న మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. చుట్టు పక్కల గ్రామాల్లో సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి రెండున్నర తులాల బంగారంతో పాటు రెండు సెల్ ఫోన్లు ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: కడుపు నొప్పి కారణంగా జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మేడుదుల రాజయ్య (39) మొదటి భార్య ఎనిమిది సంవత్సరాల క్రితం చనిపోయింది. ఏడేళ్ల క్రితం బశవ్వను రెండో వివాహం చేసుకున్నాడు. రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించుకున్నా తగ్గలేదు. దీంతో కొద్దిరోజులుగా మానసిక వేదనకు గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈనెల 11న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. సాయంత్రం సమయంలో బశవ్వ ఫోన్ చేయగా తాను సమీపంలోని ఓ ఆలయం దగ్గర పురుగు మందు తాగి పడిపోయినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి వెళ్లి రాజయ్యను ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడనుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు.

పోతుర్నార్‌కు చెందిన ఒకరు..

సిరికొండ: మండలంలోని పోతుర్నార్ గ్రామానికి చెందిన పెద్దోల్ల గంగాధర్(55) చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. గంగాధర్ శనివారం రాత్రి పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందాడని ఎస్సై సోమవారం తెలిపారు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నీళ్లలోని మోటారు తీయబోయి మృత్యువాత

మాచారెడ్డి:నీటిలో మునిగిన విద్యుత్ మోటారును పైకి తీసే క్రమంలో నీట మునిగి ఒకరు మృతిచెందారు. మండలంలోని పాల్వంచ వాగులో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. లక్ష్మిరావులపల్లి గ్రామానికి చెందిన తోకల సత్యం (35)తోపాటు మరో ఇద్దరు పాల్వంచ గ్రామానికి చెందిన ఓ రైతు మోటారు నీట మునగగా తీయడానికి వెళ్లారు. ఈ ప్రయత్నంలో నీట మునిగిన సత్యం పైకి రాకపోవడంతో అనుమానం వచ్చి నీటిలో వెదికారు. బయటకు తీసి చూసేవరికి సత్యం చనిపోయాడు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మాక్లూర్: ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రావడం లేదని మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన ఈర్నాల రమేశ్(29) పీవోపీ పనులు చేస్తూ జీవిస్తాడు. ఆయనకు ఏడాది క్రితం వివాహం అయింది. భార్య గర్భవతి కావడంతో పుట్టింటి వారు ప్రసవం కోసం తీసుకెళ్లారు. రమేశ్ భార్యను తరుచూ తన వద్దకు రమ్మనేవాడు. అయితే అందుకు భార్య తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో మనస్తాపం చెందిన రమేశ్ గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.